క్లుప్తంగా

15 నుంచి చౌడేశ్వరి దేవి నవరాత్రి ఉత్సవాలు


చౌడేశ్వరి దేవి అమ్మవారు

మద్దికెర: మండల కేంద్రంలోని చౌడేశ్వరి దేవాలయంలో విజయదశమి సందర్భంగా ఈనెల 15వ తేదీ నుంచి 23 తేదీ వరకు నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు పెద్దకోట్ల రమేష్ శుక్రవారం తెలిపారు. ప్రతిరోజు అమ్మవారిని ఒక్కో రూపంలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. భక్తులు పూజల్లో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలన్నారు.

విద్యుత్ శాఖ ఈఈగా బబ్రువాహన


ఈఈని సత్కరిస్తున్న డీఈ

ఎమ్మిగనూరుటౌన్: ఎమ్మిగనూరులో కొత్తగా విద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయం ఏర్పాటు కావడంతో డివిజన్‌కు ఈఈగా బబ్రువాహన నియమితులయ్యారు. ఎమ్మిగనూరు, మంత్రాలయం, గూడూరు సబ్ డివిజన్లతో ఎమ్మిగనూరులో డివిజన్ కార్యాలయం ఏర్పాటు చేశారు. ఈ మేరకు తిరుపతి నుంచి బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించిన ఆయన్ను శుక్రవారం స్థానిక డీఈ రాఘవేంద్రతో పాటు ఆయ సబ్ డివిజన్ల డీఈలు విశ్వ శాంతి స్వరూప్, జాన్‌లతో పాటు ఏఏఓ చంద్రబోస్, ఏఈలు కార్యాలయంలో ఘనంగా సత్కరించారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న మంత్రి


హాలహర్విలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

హాలహర్వి: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి గుమ్మనూరు జయరాం ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ భీమప్పచౌదరి, జెడ్పీటీసీ సభ్యుడు లింగప్ప పేర్కొన్నారు. వారు శుక్రవారం హాలహర్విలో సుంకలమ్మ దేవి ఆలయం నుంచి గూళ్యం రస్తా వరకు, అలాగే ఎస్సీ కాలనీ నుంచి ఎమ్మార్వో కార్యాలయం రస్తా వరకు, వెంకటరామిరెడ్డి ఇంటి నుంచి బసవన్న గుడి వరకు రూ.15 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులు పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రాజశేఖర్, నిట్రవట్టి రైతు లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా స్థావరాలపై దాడులు


కొత్తపేట కొండల్లో సారా తయారీ సామగ్రిని ధ్వంసం చేస్తున్న పోలీసులు

హొళగుంద: మండల పరిధిలోని కొత్తపేట కొండల్లో శుక్రవారం నాటుసారా స్థావరాలపై ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు, సెబ్ సీఐ ఎర్ర వెంకట్ ఆధ్వర్యంలో హొళగుంద ఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బంది విస్తృత దాడులు చేపట్టారు. నాటుసారా తయారీకి ఉంచిన బెల్లం ఊట ధ్వంసం చేశారు. 600 లీటర్ల బెల్లం ఊటతో పాటు తయారీకి ఉంచిన ముడి సరుకు, ప్లాస్టిక్ బిందెలు, సామగ్రిని తగలబెట్టారు. దేవరగట్టు దసరా బన్ని ఉత్సవాల్లో నాటుసారా, అక్రమ మద్యం కట్టడి చర్యల్లో భాగంగా ఈ దాడులు చేపట్టారు. అదేవిధంగా కొత్తపేట గ్రామంలో మల్లయ్య అనే వ్యక్తిని అరెస్ట్ చేసి 20 లీటర్ల నాటుసారా, 96 కర్ణాటక మద్యం టెట్రా పాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

వాల్మీకి జయంతి ఘనంగా నిర్వహించాలి

పత్తికొండ రూరల్: వాల్మీకి మహర్షి జయంతిని పండుగలా జరుపుకుందామని వాల్మీకి సంఘం జాతీయ కార్యదర్శి ఆస్పరి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శుక్రవారం పత్తికొండలోని సాయిబాబా దేవాలయం ఆవరణలో ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అసెంబ్లీలో వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని తీర్మానం చేసి బిల్లు కేంద్రానికి పంపించడం హర్షణీయమన్నారు. అధికారికంగా వాల్మీకి మహర్షి జయంతి నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం జీఓ జారీ చేయడం శుభపరిణామమన్నారు. వచ్చే నెల 28న అన్ని మండల కేంద్రాల్లో వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించుకుందామని పిలుపునిచ్చారు. వాల్మీకి సంఘం నాయకులు కృష్ణమూర్తి, చక్రాల సిద్దరాముడు, బసినేపల్లి సర్పంచ్ రామాంజినేయులు, నల్లగుండ్ల మునెప్ప తదితరులు పాల్గొన్నారు.


జొన్నగిరిలో పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమంలో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి


బనవనూరులో వైద్య పరీక్షల కోసం వచ్చిన ప్రజలు


కప్పట్రాళ్లలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ రామగిడ్డయ్య

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం


చక్రాళ్ల గ్రామంలో కేస్ షీట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి


గుడేకల్‌లో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఏపీ వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ చైర్మన్ వై.రుద్రగౌడ్

పత్తికొండ రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరమని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చక్రాళ్ల గ్రామంలో సర్పంచ్ పూరి శ్రీరాములు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన హెల్త్ క్యాంపునకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ధ్యేయమన్నారు. సురక్ష ద్వారా మెరుగైన వైద్యంతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం హెల్త్ క్యాంపును పర్యవేక్షించారు. రోగులకు కేస్ షీట్స్ పంపిణీ చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఫుడ్ స్టాల్స్ పరిశీలించారు. ఎంపీపీ నారాయణదాస్, ఎంపీడీఓ కవిత, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీరంగడు తదితరులు పాల్గొన్నారు.

తుగ్గలి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల చెంతకే వైద్య సేవలు అందుతున్నాయని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. శుక్రవారం జొన్నగిరి సచివాలయం–2లో నిర్వహించిన సురక్ష వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించి వైద్య సేవలను పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతానికి భిన్నంగా ప్రజలు ఆస్పత్రుల చుట్టూ తిరగకుండా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల్లోనే వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి మెరుగైన వైద్య సేవలందిస్తున్నారన్నారు. పైసా ఖర్చు లేకుండా చికిత్సతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారని చెప్పారు. వైద్య సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.


ఎస్‌హెచ్.ఎర్రగుడిలో వైద్య సేవలందిస్తున్న సిబ్బంది

దేవనకొండ: సురక్ష వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్యాధికారి రామగిడ్డయ్య సూచించారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని కప్పట్రాళ్ల గ్రామంలో వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. శిబిరంలో దాదాపు 560 మంది వైద్య చికిత్సలు పొందారు. హైరిస్క్ ఉన్న వారికి కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు అందేలా చూస్తామన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మల్లికార్జున రోగులకు సురక్ష కిట్లను పంపిణీ చేశారు. ఎంపీఈఓ గౌరీదేవి, ఈఓపీఆర్డీ సూర్యనారాయణ, వైద్యులు విజయభాస్కర్, అత్తావుల్ల, వివేక్, ఉదయ్‌శంకర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య సేవలు బాగున్నాయి



జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో సేవలు చాలా బాగున్నాయి. స్పెషలిస్టు డాక్టర్లు మా గ్రామానికే వచ్చి వైద్య పరీక్షలు చేశారు. గతంలో ఇలాంటి కార్యక్రమం ఎప్పుడూ చూడలేదు. మా లాంటి వికలాంగులకు, వృద్ధులకు ఇది ఎంతో ఉపయోగపడుతోంది.
– మాలప్ప, హులేబీడు

ఎమ్మిగనూరురూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఏపీ వీరశైవ లింగాయితీ కార్పొరేషన్ చైర్మన్ వై.రుద్రగౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం గుడేకల్ గ్రామంలో నిర్వహించిన శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధతో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. శిబిరంలో ఆయన ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. సర్పంచ్ మాల నరసమ్మ, డాక్టర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆలూరు రూరల్: మండలంలోని హులేబీడు గ్రామంలో ఎంపీడీఓ అల్లబకష్ ఆధ్వర్యంలో సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఎంపీపీ స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి 590 మంది రోగులు వచ్చి పరీక్షలు చేయించుకున్నట్లు వైద్యాధికారులు చెప్పారు.

నందవరం: మండలంలోని నదికైరవాడి గ్రామ సచివాలయంలో సర్పంచ్ ఈశ్వరమ్మ ఆధ్వర్యంలో సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 411 మందికి ఆరోగ్య పరీక్షలు చేసి మందులు అందించారు. 63 మందికి కంటి వెలుగు పథకం ద్వారా కంటి పరీక్షలు చేపట్టారు. వైద్యులు సౌజన్యలత, పరిమళ, మౌనిక, శ్రీదేవి వైద్య సేవలందించారు. శిబిరాన్ని ఎంపీడీఓ దశరథరామయ్య పర్యవేక్షించారు.

కృష్ణగిరి: మండల పరిధిలోని ఎస్‌హెచ్ ఎర్రగుడి గ్రామంలో నిర్వహించిన సురక్ష వైద్య శిబిరాన్ని సర్పంచ్ గిరిబాబు, ఎంపీడీఓ విశ్వమోహన్ పర్యవేక్షించారు. ఈ శిబిరంలో 374 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ముందులు అందజేసినట్లు వైద్యాధికారి ప్రదీప్ తెలిపారు.

అందరికీ ఆరోగ్యం ప్రభుత్వ లక్ష్యం


హెచ్. కైరవాడి శిబిరంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన

గోనెగండ్ల: అందరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని హెచ్.కైరవాడి గ్రామ సచివాలయంలో సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డితో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సురక్ష వైద్య శిబిరాలలో స్పెషలిస్ట్ డాక్టర్లు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేయడంతో పాటు మెరుగైన వైద్య అవసరమైన వారిని ఆరోగ్యశ్రీ కింద నెట్‌వర్క్ ఆస్పత్రులకు రెఫర్ చేస్తారన్నారు. అలాగే కంటి వెలుగులో పథకంలో భాగంగా కంటి పరీక్షలు నిర్వహించి కళ్లద్దాలను అందజేస్తారన్నారు. వైద్య శిబిరాలలో పిల్లలకు, బాలింతలు తీసుకోవాల్సిన పౌష్టికాహారం గురించి ఏఎన్ఎం, అంగన్‌వాడీ సిబ్బంది అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి మాట్లాడుతూ దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతున్న వారికీ అవసరమైన వైద్య సహాయం అందజేయడం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించి పేదలకు ఒక్క రూపాయి ఖర్చు లేకుండా నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నట్లు వివరించారు. డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ రామగిడ్డయ్య, సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు బందెనవాజ్, మన్సూర్, భాస్కర్ రెడ్డి, మోహన్ రెడ్డి, పులికొండ, ధర్మకారి నాగేశ్వర రావు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.


వైద్య శిబిరానికి హాజరైన గ్రామస్తులు

ఆస్పరి: మండలంలోని బనవనూరు గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. 300 మందికి వైద్య సేవలు అందించినట్లు డాక్టర్ రఘురామిరెడ్డి తెలిపారు. డాక్టర్లు కల్పన, బాలకృష్ణారెడ్డి, వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. సర్పంచ్ పెద్దరెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నవరత్నాలతో సంక్షేమ విప్లవం

నందవరం: నవరత్నాల అమలుతో రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ విప్లవం తీసుకొచ్చారని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక గ్రామ సచివాలయం–3 పరిధిలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం నుంచి అందిన సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం జగనన్న ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. అవినీతి, లంచాలకు తావులేకుండా నేరుగా లబ్ధిదారుల చెంతకే పథకాలు అందిస్తున్నారని వివరించారు. దళారుల ప్రమేయం లేకుండా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు మంజూరు చేస్తున్నారన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే పాలన తెచ్చారన్నారు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సంక్షేమ పథకాలు గుర్తుంచుకుని మరోమారు సీఎం వైఎస్ జగనన్నను దీవించాలని కోరారు. గ్రామంలో తాగునీరు, సీసీ రోడ్ల సమస్యకు త్వరలోనే పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు శివారెడ్డిగౌడ్, జెడ్పీటీసీ నిఖిల్ చక్రవర్తి, సర్పంచ్ తోట సావిత్రి, నాయకులు రమేశప్పగౌడ్, నాగరాజు, ముత్తన్న, ఎంపీడీఓ దశరథరామయ్య, ఎంఈఓ సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మహిళకు సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి

భవిత కేంద్రం పరిశీలన


భవిత కేంద్రంలో సిబ్బందితో మాట్లాడుతున్న డీఈఓ రంగారెడ్డి

గోనెగండ్ల: మండల కేంద్రంలోని భవిత కేంద్రాన్ని శుక్రవారం డీఈఓ రంగారెడ్డి పరిశీలించారు. కేంద్రంలో ఎంతమంది పిల్లలు ఉన్నారు. వారి విద్యాభ్యాసం ఎలా కొనసాగుతుందని ఎంఈఓ రామాంజినేయులను అడిగి తెలుసుకున్నారు. ఇతర అవసరాలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

- మండలంలోని పలు పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నరసింహులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం యూటీఎఫ్ నాయకులు డీఈఓ రంగారెడ్డికు వినతిపత్రం అందజేశారు. అలాగే జీపీఎస్‌ను రద్దు చేసి ఆ స్థానంలో పాత పెన్షన్ విధానం అమలు చేయాలని చేయాలని యూటీఎఫ్ జిల్లా నాయకులు గుమ్మలబాబు, అబ్దుల్ సలీం కోరారు. శుక్రవారం పోస్టు కార్డుల ఉద్యమాన్ని గోనెగండ్ల ఉన్నత పాఠశాల ప్రాంగనంలో వారు ప్రారంభించారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

నందవరం: జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ దశరథ రామయ్య సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని కొత్తకైరవాడి, నదికైరవాడి గ్రామాల్లోని జగనన్న కాలనీలోని ఇళ్ల నిర్మాణాలను ఎంపీడీఓ పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడారు. ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలని, బిల్లులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు చెల్లిస్తామన్నారు. జగనన్న కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైయినేజీలు, విద్యుత్ దీపాలు, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. గృహ నిర్మాణాల్లో సమస్య ఉంటే తమ దృష్టి తీసుకురావాలని పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. హౌసింగ్ ఇన్‌చార్జ్ ఏఈ గురుస్వామి, ఇంజినీరింగ్ అసిసెంట్లు పాల్గొన్నారు.


కొత్తకైరవాడిలో ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ దశరథ రామయ్య

ప్రగతి సంస్థ సేవలు అభినందనీయం


ఆలూరు ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన ల్యాబ్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓలు

ఆలూరు రూరల్: ప్రగతి స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమని ఎంఈఓలు కోమలాదేవి, చిరంజీవి రెడ్డి అన్నారు. శుక్రవారం ఆలూరు జెడ్పీ బాలికల పాఠశాలలో యునైటెడ్ ముంబైకి చెందిన ప్రగతి సంస్థ రూ.7.50 లక్షలతో ఏర్పాటు చేసిన సైన్స్ ల్యాబ్, లైబ్రరీని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాలికల విద్యను ప్రోత్సహించి వారిలో దాగివున్న నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ప్రగతి సంస్థ ముందు రావడం సంతోషదాయకం అన్నారు. అనంతరం ఆ సంస్థ కో–ఆర్డినేటర్ పలక్ చౌదరి మాట్లాడుతూ.. డిస్నీ ప్లస్ హాట్‌స్టార్ సహకారంతో జిల్లాలోని 5 బాలికల ఉన్నత పాఠశాలల్లో ల్యాబ్, లైబ్రరీలు ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు వీటిని ఉపయోగించుకుని ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. ప్రాజెక్ట్ ప్రగతి జిల్లా ఔట్ రీచ్ వర్కర్ రాము, ఆలూరు ఔట్ రీచ్ వర్కర్ స్నేహలత, ఎడ్యూకేషన్ ఫెసిలేటర్స్ సత్యవాణి, భారతి ఉపాధ్యాయులు ఉన్నారు.

వేధింపుల కేసు నమోదు

వెల్దుర్తి: స్థానిక సచివాలయం–3 జేఎల్ఎం మధు, కుటుంబీకులపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం వేధింపులు, గృహహింస కేసు నమోదైనట్లు ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. 11 ఏళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకుని వెల్దుర్తిలో నివాసముంటుండగా, ఇటీవల కట్నం కోసం వేధిస్తున్నాడని మధుపై అతని భార్య జయలక్ష్మి ఫిర్యాదు చేసింది. మంగళవారం తన బంధువులు పంచాయతీ చేసేందుకు రాగా మధుతోపాటు అతని మామ, ఆడపడుచు, మరిది, చిన్న అత్త తనపై దాడి చేసి గాయపరిచారని ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు నిందితుడితో పాటు, అతని కుటుంబీకులపై కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

'రైతు భరోసా' దరఖాస్తులకు 15 వరకు అవకాశం

తుగ్గలి: వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ కింద ఏటా రూ.13,500 సాయం పొందేందుకు కొత్తగా దరఖాస్తు చేసుకునేవారు ఈ నెల 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ శాఖ మండల అధికారి పవన్‌కుమార్ శుక్రవారం తెలిపారు. నాలుగేళ్లుగా ఈ పథకం ద్వారా ఏడాదికి మూడు విడతలుగా పెట్టుబడి సాయం అందిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు రైతు భరోసా పొందని అర్హత కలిగిన కొత్త రైతులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. భూ పత్రాలు, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా వివరాలతో ఆర్‌బీకేల్లో వ్యవసాయ శాఖ సహాయకులను సంప్రదించాలన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

చిప్పగిరి: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఆలూరు మార్కెట్ యార్డు చైర్మన్ గుమ్మనూరు నారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఏఓ విజయలక్ష్మి ఆధ్వర్యంలో వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. పంటల సాగులో అధిక దిగుబడులు సాధించేందుకు రైతులకు తగు సూచనలు, సలహాలు చేశారు. ప్రభుత్వం అందించే సబ్సిడీ పప్పుశనగ విత్తనాల కోసం రైతులు ఆయా గ్రామాల్లోని ఆర్బీకేల్లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కమలమ్మ, సభ్యులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రుణాలు మంజూరు

చిప్పగిరి: మండలంలో అర్హత ఉన్న రైతులందరికీ రుణాలు మంజూరు చేయడం జరుగుతుందని బెల్డోణ సొసైటీ అధ్యక్షుడు మల్లికార్జున అన్నారు. శుక్రవారం స్థానిక సొసైటి కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. బెల్డోణ పీఏసీ పరిధిలోని గ్రామాలకు రైతు నేస్తం, రాజన్న చేయూతతో పాటు సాధారణ పంట రుణాలు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. పొలం, విస్తీర్ణంను బట్టి రూ.10 లక్షల వరకు రైతులు రుణాలు పొందవచ్చన్నారు. రుణాలు పొందిన రైతులు సకాలంలో రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు.

వ్యవసాయ సలహామండలి సమావేశం

హాలహర్వి: స్థానిక వ్యవసాయ కార్యాలయంలో శుక్రవారం మండల వ్యవసాయ సలహామండలి సమావేశాన్ని చైర్మన్ హంపిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేరుశనగ విత్తనాలు త్వరగా మండలానికి తెప్పించాల్సిందిగా కోరారు. అలాగే రైతులకు సాగునీటిని ఎప్పటివరకు అందిస్తారో చెప్పాలని అధికారులను కోరారు. ఖరీఫ్‌లో ఈ క్రాప్ బుకింగ్, ఈ–కేవైసీ ముగిసిందని, 632 మంది రైతులు ఈ–కేవైసీ చేయించుకోలేదని చెప్పారు. పత్తికొండ ఏడీఏ, మండల వ్యవసాయ అధికారి సురేష్‌బాబు, ఏఈఓ రంగన్న, సభ్యులు మల్లికార్జున, కందనాతి రంగన్న పాల్గొన్నారు.

విత్తనశుద్ధి తప్పనిసరి

పత్తికొండ రూరల్: రబీ పంట కాలానికి పప్పుశనగ విత్తనాలు తీసుకున్న రైతులు ట్రైకోడెర్మావిరిడితో విత్తన శుద్ధి చేసుకుని పొలంలో విత్తుకోవాలని మండల వ్యవసాయ అధికారి వెంకట్రాముడు సూచించారు. శుక్రవారం స్థానిక మండల వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ కొత్త పాస్‌బుక్కులు చేయించుకున్న రైతులు రైతు భరోసా పథకం సాయం పొందేందుకు ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. పంట సాగుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వ్యవసాయ సలహా మండలి చైర్మన్ తిప్పయ్య, గాంధి రెడ్డి, హార్టికల్చర్ అధికారి దస్తగిరి, ఏఈఓ రియాజ్ భాష, రుక్సానా, రైతు భరోసా సిబ్బంది పాల్గొన్నారు.

పల్లె చెంతకు పాలన

తుగ్గలి: గ్రామ సచివాలయాలతో పల్లె చెంతకు పాలన తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. రూ.82.20 లక్షలతో జొన్నగిరిలో నిర్మించిన సచివాలయ భవనాలను శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగనన్న సచివాలయ, వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి జాతిపిత మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేశారన్నారు. సచివాలయాల ద్వారా వ్యయప్రయాసలు లేకుండా ప్రజలకు సొంతూళ్లలోనే ప్రభుత్వ సేవలు అందుతున్నాయన్నారు. నిత్యం పేద ప్రజల అభ్యున్నతికి కష్టపడుతున్న జగనన్నకు అండగా నిలవాలని ప్రజలను కోరారు. బీసీ కాలనీ, దేశాయ తండాలో తాగునీటి సమస్య తీర్చాలని స్థానికులు ఎమ్మెల్యేను కోరారు. త్వరలోనే నీటి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. స్థలదాత వర ప్రసాద్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రామచంద్రారెడ్డి, జగన్నాథరెడ్డి, నాగేష్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.


జొన్నగిరి సచివాలయం-2ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఆస్పరి: మండలంలోని కారుమంచి జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ అబ్దుల్ లతీఫ్ శుక్రవారం తెలిపారు. ఈ నెల 9వ తేదీన కర్నూలు ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో అండర్–14 విభాగంలో వెన్నెల, అండర్–17 విభాగంలో స్రవంతి, మన్సూర్ బాష, ఎంపికయ్యారన్నారు. విద్యార్థులను హెచ్‌ఎంలు శోభారాణి, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆలూరు రూరల్: రాష్ట్రస్థాయి సెపక్ తక్రా పోటీలకు హత్తిబెళగల్ గ్రామ జెడ్పీ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఈ నెల 12వ తేదీన కర్నూలులో జరిగిన అండర్–14 స్కూల్ గేమ్స్‌లో మానస, చాందిని, నూర్జహాన్ బాలుర విభాగంలో వరుణ్‌కుమార్, రియాజ్ ఎంపికయ్యారన్నారు. వీరు వచ్చే నెల ఎన్టీఆర్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి సెపక్ తక్రా పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు.

హాలహర్వి: మండలంలోని అర్ధగేరి గ్రామంలో బోగేటప్ప, సుంకులమ్మ దంపతుల కుమార్తె హెచ్.శ్రీవలి అనే 8వ తరగతి విద్యార్థిని రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు స్థానిక జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం రమణయ్య తెలిపారు. ఈ మేరకు శుక్రవారం విద్యార్థి శ్రీవల్లిని ప్రత్యేకంగా అభినందించారు.

బన్ని ఉత్సవంలో రింగు కర్రలు వద్దు

హొళగుంద: దేవరగట్టు మాళమల్లేశ్వర స్వామి దసరా బన్ని ఉత్సవాన్ని సంప్రదాయంగా, భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని ఎస్ఐ శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం నెరణికి, కొత్తపేట గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ.. బన్ని ఉత్సవానికి భక్తులు రింగు కర్రలు తీసుకెళ్లడం, మద్యం సేవించి ఉత్సవాల్లో పాల్గొనడం మంచి సాంప్రదాయం కాదన్నారు. విగ్రహాల ఊరేగింపులో అగ్గి కాగడాలను భక్తులపై విసరడం, అల్లర్లకు పాల్పడడం వంటివి చేస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. శాంతి భద్రతలకు విఘాతం కల్పించే వారిపై నిఘా ఉంటుందని చెప్పారు. కక్షలు, కార్పణ్యాలకు వెళ్లకుండా పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు.

ఆలూరు: మండలంలోని అరికెర, అరికెరతాండ గ్రామాల్లో శుక్రవారం తహసీల్దార్ రామాంజనేయులు, ఎంపీడీఓ అల్లబకాష్ ఆధ్వర్యంలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించి దేవరగట్టు బన్ని ఉత్సవం నిర్వహణపై పలు సూచనలు చేశారు. రింగు కర్రలు తీసుకెళ్లరాదని, మద్యం సేవించి ఉత్సవాల్లో పాల్గొనరాదని, కక్షలు, కార్పణ్యాలకు పోకుండా ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని సూచించారు. హాలహర్వి ఎస్ఐ నాగేంద్ర మాట్లాడుతూ.. ఎవరైనా నాటుసారా తయారు చేయడం, విక్రయించడం, అక్రమంగా కర్ణాటక మద్యం తరలించడం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీటీ గుండాలనాయక్, సీనియర్ అసిస్టెంట్ బసన్నగౌడు, పంచాయతీ కార్యదర్శి వెంకటనాయుడు, సర్పంచ్ నాగరాజ్, తదితరులు పాల్గొన్నారు.

వాణిజ్య పంటల సాగుకు ప్రోత్సాహం

ఆలూరు: వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని రైతులు లాభసాటి వ్యవసాయంపై దృష్టి పెట్టాలని ఏడీఏ సునీత సూచించారు. వాణిజ్య పంటల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని వివరించారు. స్థానిక ఏడీఏ కార్యాలయంలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. చిప్పగిరి మండలం రామదుర్గంలో రవికుమార్‌గౌడు రెండెకరాల్లో, ఆలూరు మండలం హత్తిబెళగల్‌లో శివ అనే రైతు ఎకరం పొలంలో వక్క పంటలను సాగు చేశారన్నారు. రైతులు తక్కువ నీటి వినియోగంతో లాభసాటి పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. డివిజన్‌లో ఇప్పటివరకు 250 మంది రైతులకు చెందిన 6 వేల ఎకరాలకు డ్రిప్, స్ప్రింక్లర్లు రాయితీతో అందించినట్లు చెప్పారు.

కరువు జిల్లాగా ప్రకటించాలి

మద్దికెర: లక్షలాది పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేసినా సకాలంలో వర్షాలు పడకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని ప్రభుత్వం స్పందించి కర్నూలును కరువు జిల్లాగా ప్రకటించి అన్నదాతలను ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హనుమప్ప, మండల కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో విత్తనం వేసి వర్షాభావ పరిస్థితుల వల్ల పైర్లు ఎదగకపోవడంతో పంటలను తొలగించుకున్నారని, అలాగే రబీ సీజన్ ప్రారంభమైనా ఇంతవరకు వాన జాడలేదన్నారు. కర్నూలును కరువు జిల్లాగా ప్రకటించాలనే డిమాండ్‌తో ఈ నెల 16వ తేదీన కలెక్టరేట్ ముట్టడిస్తామన్నారు.

హొసరిత్తి మఠంలో పీఠాధిపతి



మంత్రాలయం: ధార్మిక పర్యటనలో భాగంగా మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు కర్ణాటకకు వెళ్లారు. శుక్రవారం హావేరి జిల్లా హొసరిత్తి మఠంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. శ్రీమఠం పూర్వ పీఠాధిపతులు జీరేంద్రతీర్థుల మూలబృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే మూలరామదేవర సంస్థాన పూజ నిర్వహించారు. ఈ వేడుక భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.